
# జాతకం

పాలంకి సత్య



**ఇద్దరూ అబ్బాయిలే, మన జాతకాలు హాయిగా రోజులు వెళ్లిపోతాయనే చెప్తున్నాయి. మనని వృద్ధాప్యంలో చూసిన వాళ్ల కళ్లు కుడతాయి. అనుకున్నారు మహాలక్ష్మి, మురళీకృష్ణ.**

కొడుకులకు రాజీవ్, సంజీవ్ అని పేర్లు పెట్టుకున్నారు. ఇద్దరబ్బాయిలలో పెద్దవాడు డాక్టరూ, చిన్నవాడు ఇంజనీరూ అని నిర్ణయించుకున్నారు. ఆ విషయాన్నే పిల్లలిద్దరికీ నూరిపోస్తూ ఉండేవారు.

తల్లిదండ్రులు చెప్పడం వలనో, పిల్లలకే అభిరుచి ఉండడం వల్లనో కానీ రాజీవ్‌కి బయాలజీ మీదా, సంజీవ్‌కి మాథమాటిక్స్ మీదా ఆసక్తి ఏర్పడింది. ఇద్దరికీ వయస్సులో తేడా ఉండడం వల్ల చదువు చెప్పించడంలో డబ్బు దగ్గర కానీ, కాలం దగ్గర కానీ ఇబ్బంది కలగలేదు.

తల్లిదండ్రులు కోరుకున్నట్లే రాజీవ్ డాక్టరయ్యాడు. "మనం పెద్ద వాళ్ల మవుతున్నాము. శరీరాలు బలహీనమౌతున్నయి. ఇంట్లోనే డాక్టరు కనుక ఇబ్బంది లేదు" అని మహాలక్ష్మి, మురళీకృష్ణ అనుకునే సమయంలో రాజీవ్‌కి ఫారిన్ ఛాన్స్ వచ్చింది. తల్లిదండ్రులు బెంబేలు పడ్డారు.

"నేను చదువుకోవడానికే కదా వెడుతున్నాను - చదువు పూర్తవగానే వచ్చేస్తాను" అని చెప్పి వెళ్లాడు రాజీవ్.

కానీ కొడుకు మాటల మీద తల్లిదండ్రులకి నమ్మకం లేదు. ఫారిన్ కేవలం చదువు కోసమే వెళ్లే వారుండరు. చదువుకుని ఇండియాకి తిరిగి వచ్చిన వాళ్లు వాళ్లకి తెలిసినంతవరకూ ఎవరూ లేరు. రాజీవ్ కూడా తిరిగి వస్తాడని నమ్మకం వాళ్లకి లేదు ఇంట్లో డాక్టరుండాలన్న కోరిక మాత్రం ఉంది.

టెన్త్ క్లాస్ రిజల్ట్సు వచ్చాయి. సంజీవ్ మంచి మార్కులతో పాసయ్యాడు. మాథమెటిక్స్‌లో నూటికి నూరు మార్కులు వచ్చాయి.

"నువ్వు కూడా అన్నయ్యలాగే మెడిసిన్ చదువు" అన్నారతని తల్లితండ్రులు.

సంజీవ్ నిర్ఘాంతపోయాడు. చిన్నప్పటి నుంచీ ఇంజనీరింగ్ అని చెప్పి, ఇప్పుడు అకస్మాత్తుగా మాట మార్చేశారేమిటి?

ఆ విషయమే తల్లిదండ్రులని అడిగాడు.

"ఇంట్లో ఒక డాక్టరుంటే బాగుంటుంది. అన్నయ్య ఇక మన దేశానికి వస్తాడన్న నమ్మకం లేదు. నువ్వు డాక్టరయితే మాకు మనశ్శాంతి. వార్ధక్యం ఎలా గడుస్తుందన్న బెంగ ఉండదు."

సంజీవ్ ఇష్టపడలేదు. తనకి ఇంజనీరింగ్ చదవాలని ఉందన్నాడు.

"అసలు నువ్వు ఏ కోర్సులో రాణిస్తావో జ్యోతిష్కులని అడుగుదాం. వాళ్లు ఏం చెప్తే అది చేద్దాం."

సంజీవ్‌కి ఆ ఆలోచన నచ్చలేదు. తనకి ఇష్టమైనదీ, తనకి బాగా నచ్చేదీ మాథమాటిక్స్. ఆ సంగతి తెలుసుకున్న తర్వాత మాథమాటిక్స్ చదవాలి కానీ జ్యోతిష్కులని అడగటం దేనికి?

జాతకం చూసిన జ్యోతిష్కుడికి విద్య సరిగా రాదో లేక ధనార్జన కోసం మురళీకృష్ణని సంతోష పెడదామనుకున్నాడో కానీ సంజీవ్ జాతకంలో మందులతో సంబంధముండే వృత్తిలో రాణిస్తాడన్నారు.

"చూశావా నీ జాతకం ప్రకారం నువ్వు డాక్టరు కావాలి" అంటూ సంజీవ్‌ని తల్లిదండ్రులు ఇంటర్మీడియెట్ బై.పి.సి. గ్రూపులో చేర్చారు.

సంజీవ్‌కి చదువు మీద ఆసక్తి తగ్గిపోయింది. తనకి ఇష్టమైన సబ్జెక్టు చదవనివ్వని తల్లిదండ్రులపై కోపం వచ్చింది. ఎంతసేపూ మాథమాటిక్స్ గురించే ఆలోచించేవాడు.

కప్పను కొయ్యాల్సిన సమయంలో కాలుక్యులస్ గుర్తొచ్చేదతనికి.

అతి కష్టమ్మీద ఇంటర్మీడియట్ పాస య్యాడు. ఎంట్రెన్స్ పరీక్షలో రాంకు రాలేదు.

మహాలక్ష్మి, మురళీకృష్ణలు నిరుత్సాహ పడలేదు. మళ్లీ చదవమని ప్రోత్సహించారు. మళ్లీ విఫలమయ్యాడు సంజీవ్.

"ముచ్చటగా మూడోసారి ప్రయత్నించు. ఈ సారి తప్పకుండా నెగ్గుతావు" అన్నారు తల్లిదండ్రులు. మూడోసారీ రాంకురాలేదు.

బి.ఎస్‌సి. లో చేరడానికి ఇంటర్మీడియెట్‌లో మంచి మార్కులు రాలేదు. అతి కష్టం మీద చిన్న కాలేజీలో సీటు వచ్చింది. బి.ఎస్‌సి. అయిందనిపించాడు.

తల్లిదండ్రుల నిరాశను రెట్టింపు చేస్తూ అతనికి ఎక్కడా ఉద్యోగం కూడా రాలేదు. సొంతంగా చిన్న మెడికల్ షాపు పెట్టుకున్నాడు.

మాథమాటిక్స్ నూటికి నూరు మార్కులతో టెన్త్ క్లాసు పాసయిన అబ్బాయి చివరకు చిన్న మందుల షాపు నడిపేవాడిలా తయారయ్యాడు.

"ఇంట్లో డాక్టరుంటే మంచిది. జబ్బు చేస్తే మందులకి పరిగెత్తనక్కరలేదు అనే వారుగా. ఇంట్లో మందుల షాపే ఉంది" అన్నాడు సంజీవ్.

తల్లిదండ్రులు సిగ్గుతో తలవంచుకున్నారు. తమ ఆశకు జ్యోతిష్కుల భవిష్యవాణి తోడయింది. లేదా తమ ఆశకు సరిపోయేటట్ల జ్యోతిషం చెప్పారా? వాళ్లు చెప్పింది తప్పు మాకు నచ్చినట్లు అన్వయించుకున్నారా? మందులకు సంబంధించిన ఉద్యోగం అంటే కెమికల్ ఇంజనీరింగ్ చదివి, మందుల ఫాక్టరీలో పని అవచ్చు కదా.

ఏమైతేనేమి, మందులతో సంబంధమున్న వృత్తి చేస్తాడన్న మాట మాత్రం నిజమైంది. జాతకం నిజమైతేనేమి, కొడుకు జీవితం ఎండమావి అయింది.

•

